


# పరదేశీ కథలు

- చిట్టే సిద్ధ లలిత



-94-

## కువైట్ లో చంద్రముఖి

**"ఏమిటా ఏడవడం..?** మనుషులకు రోగాలు రాకుండా వుంటాయా. ఇలా ఏడుస్తూ కూర్చుంటే పనులు అయినట్లే. ఇక చాల్లే. వెళ్ళి పని చూడు" ఈసడించుకుంది శ్రీలంక వంట మనిషి చంద్రముఖి.

ఆమె మాటలకి సునీత మ్రాన్పడిపోయింది. చేతిలో ఉత్తరాన్ని జాలిగా చూసింది. అందులోని అక్షరాల్లో అనారోగ్యంతో మంచాన పడిన తండ్రి కనిపిస్తున్నాడు. చిన్నప్పుడు వేలు పట్టి నడిపించడం, భుజాన ఎత్తుకుని తిప్పడం, కథలు చెప్పడం గుర్తొచ్చి కళ్ళు చెమర్చాయి. తండ్రి తీవ్రమైన అనారోగ్యంతో వున్నట్లు రాసిన ఆ ఉత్తరం సునీతను కృంగదీసింది. ఒక్కసారి తండ్రిని చూడాలని ఆమె ఆరాటపడుతోంది.

ఇవే ఆఖరి రోజులయితే? ఆ ఊహకే ఆమె వణికిపోయింది. అందుకే సేటును అడిగి ఇండియాకు పోవాలి అని నిశ్చయించుకుంది సునీత.

✱✱✱

కువైట్ కు వచ్చి ఏడు నెలలే అయింది. రెండేళ్ళు పూర్తయి కాంట్రాక్ట్ ముగిస్తే గానీ వీళ్ళు పంపించరు. తీరా అడిగాక కాదంటే ఎలా? భయమేసింది.

ఆ సాయంత్రం కాస్త ధైర్యం తెచ్చుకుని "ఇంటికి వెళ్ళి పది రోజుల్లో తిరిగొస్తానని" చెప్పి సేటును అడిగింది. సేటు జవాబు చెప్పేలోగా చంద్రముఖి అందుకుని "బాబా ఇప్పుడు కుదరదు. సునీత వచ్చి ఏడు నెలలే అయింది. ఇంకొక ఆరు నెలలు పోయాక పంపండి. అందరూ ఇలాగే పని తప్పించుకుని పోవడానికి కల్లబొల్లి కబుర్లు చెప్తారు. ఇండియా నుండి ఉత్తరాలు రాయించుకుంటారు. ఇది వెళ్ళిపోయి రాకపోతే మీకు నష్టం కదా. ఇప్పటికిప్పుడు వెళతా అంటే ఇక్కడ పని ఎవరు చేస్తారు. నేనయితే చెయ్యను" తరవాత మీ ఇష్టం కోపంగా చెప్పింది చంద్రముఖి.

ఆమె ఆ ఇంట్లో ఇరవయ్యి ఏళ్ళుగా పని చేస్తోంది. అందుకే అంత ధీమాగా మాట్లాడుతోంది. కొత్తగా వచ్చిన పనిమనుషులపై పెత్తనం చెలాయిస్తూ అంతా నాదే అనే తీరుగా ప్రవర్తిస్తుంది. పనివారికి మామా బాబాలతో పెద్దగా సమస్య లేదు గానీ ఈ చంద్రముఖి తోనే తలనొప్పి.

కొత్తగా వచ్చిన మనిషికి మొదట్లో భాష రాదు కదా.ఇదే అలుసుగా తీసుకుని మామా బాబాకు వాళ్ళ మీద అన్నీ చాడీలు చెపుతుంది. వాళ్ళకు పేలు వున్నాయనో, చుండ్రు వుందనో చెప్పి జుట్టు కట్ చేయిస్తుంది. తలకు గుడ్డ చుట్టుకోవాలి అని చెప్పి వప్పిస్తుంది. దాని పోరు పడలేక చాలామంది పనిమనుషులు వచ్చిన వాళ్ళు వచ్చినట్లే పారిపోయారు. ఎప్పటికప్పుడు ఇదే తంతు. అది ఇక మారదు. దాని జన్మ అంతే.

బాబా తలాడించాడు. "అవును. నిజమే.. నువ్వు వెళ్ళి తిరిగి వస్తావని నమ్మకం ఏమిటి? నిన్ను ఏజంటు దగ్గర 400 దినార్లు పెట్టి కొనుక్కున్నాను. నువు రాకపోతే నాకు నష్టం కదా. కనీసం ఇంకొక ఆరు నెలలు పని చేస్తేనే నువ్వు ఇంటికి పోగలవు" తీర్మానించాడు బాబా.

చంద్రముఖి తన మాట నెగ్గినందుకు చిన్నగా నవ్వింది.

జబ్బు పడిన తండ్రిని తలచుకున్న సునీతకు దు:ఖం ఆగలేదు. కళ్ళ నిండా నీళ్ళు పెట్టుకుంది. ఇదంతా హాల్లో కూర్చుని వున్న మామా, పిల్లలు వింటూనే వున్నారు. కానీ బాబా మాటకు ఎవరూ ఎదురు చెప్పలేరు. అందులో చంద్రముఖి మాట కాదంటే ఇంకేమైనా వుందా. రాద్ధాంతం చేస్తుంది.

సేటుకు నలుగురు పిల్లలు. వారిలో పెద్దది ఫాతిమా. దానికి సునీత అంటే ఇష్టం. సునీత బాధను చూసి ఫాతిమా కరిగిపోయింది. కానీ ఏం చెయ్యాలో అర్థం కాలేదు. చిన్నగా తల్లి పక్కన చేరి సునీతను ఇండియాకు పంపించమని అడిగింది. మామా గయ్ మని అరిచింది.

"బాబా జవాబు చెప్పాడు కదా. మధ్యలో నీకెందుకు బాధ. వున్నట్టుండి ఇప్పుడది పోతే పనంతా ఎవరు చేస్తారు" అంది కోపంగా.

ఫాతిమా మిన్నకుండిపోయింది. అప్పటికి ఆ సంగతి ముగిసిపోయింది. అందరూ ఎవరి పనుల్లో వాళ్ళు మునిగిపోయారు.

కానీ కలత చెందిన సునీత కళ్ళు మాత్రం రోజంతా వర్షిస్తూనే వున్నాయి. జాలి హృదయంగల ఫాతిమా ఇదంతా గమనిస్తోంది.

ఒకరోజు పోస్టుమాన్ ఉత్తరాలు తెచ్చి ఇచ్చాడు.

ఎప్పటిలా చంద్రముఖి వాటిని అందుకుని ఇంట్లోకి తెచ్చింది.

"ఇండియా నుండి నాకేమైనా ఉత్తరం వచ్చిందా" ఆశగా అడిగింది సునీత.

"రాలేదు. ఒకవేళ వుంటే ఇస్తాలే. నేనేమీ తినను" నిర్లక్ష్యంగా జవాబు చెప్పింది చంద్రముఖి.

నిరాశగా అక్కడనుండి కదిలి లోపల గదులు శుభ్రం చేయడానికి వెళ్ళిపోయింది సునీత.

హాల్లో కూర్చుని టివి చూస్తున్న ఫాతిమాకు ఎందుకో అనుమానం వచ్చింది.

నీళ్ళు తాగుదామని వంటింట్లోకి వచ్చిన ఫాతిమాకు ఒక ఉత్తరాన్ని చించి ఉండగా చేసి చెత్తబుట్టలోకి విసురుతున్న చంద్రముఖి కనిపించింది.

"ఏయ్.. ఏంటది" అడిగింది ఫాతిమా.

"ఆ.. అది.. అది నాదే.. పాత ఉత్తరం.  చించి పడేసాను" అంది చంద్రముఖి నీళ్ళు నములుతూ.

ఆ ముక్కలను చెత్తబుట్టలోనుండి బయటికి తీసింది ఫాతిమా.

"సునీతా.. ఓ సునీతా" కేకేసింది గట్టిగా.

చేతులు తుడుచుకుంటూ పరుగున వచ్చింది సునీత.

"ఈ ఉత్తరం ముక్కలలోని అక్షరాలు సింహళ భాష లోనివా.. మీ ఇండియావా..?" అడిగింది.

చూసిన సునీత "ఇవి మా తెలుగు అక్షరాలే ఫాతిమా. ఈ జాబు మా ఇంటి దగ్గరనుండి వచ్చింది. మా వాళ్ళు ఏమి రాసారో తెలియడం లేదు. మా నాయనకు ఆరోగ్యం ఎలా వుందో ఇపుడెలా తెలుస్తుంది" అంది బాధగా ముక్కల్ని జత చేయాలని ప్రయత్నిస్తూ.

వెంటనే చంద్రముఖి చెంప మీద ఛెళ్ళుమని కొట్టింది ఫాతిమా. అంతవరకూ ముసిముసిగా నవ్వుకుంటున్న చంద్రముఖి నిర్ఘాంతపోయి పెద్ద గొంతు వేసుకుని లబోదిబో అని ఏడ్చింది.

"అప్పటినుండీ చూస్తున్నాను. నువ్వు చేసే పని బాలేదు. తప్పు చేస్తున్నావు. ఇంట్లోకి వచ్చిన పనివాళ్ళను అందరినీ ఇలాగే బాధ పెడుతున్నావు. నీకు హృదయం లేదా? నీ చేష్టలన్నీ  నేను గమనిస్తున్నాను. పిచ్చి పనులు చెయ్యక జాగ్రత్తగా వుండు" చెప్పింది తర్జని చూపిస్తూ ఫాతిమా.

ఈ ఏడుపులు విని మామా వంటింట్లోకి వచ్చింది. "ఏమయ్యింది" అంటూ ప్రశ్నించింది. కల్లబొల్లి మాటలతో ఏదో చెప్పబోయింది చంద్రముఖి.

తనను మాట్లాడనివ్వలేదు ఫాతిమా. అంతా చెప్పుకొచ్చింది. అయినా మామాకు లౌక్యం బాగా తెలుసు.

చంద్రముఖి లేకపోతే ఇంట్లో వంట ఎవరూ చెయ్యలేరు.

ఇరవయేళ్ళుగా పని చేస్తున్న చంద్రముఖివైపే మాట్లాడి ఆమెనే ఓదార్చి చక్కా పోయింది మామా.

వంట చేసుకునే పనిమనిషి ఇది. ఇంట్లో దీని పెత్తనం ఎక్కువయిపోయింది అని పళ్ళు కొరికింది ఫాతిమా.

తండ్రికెలా వుందో అని ఆలోచిస్తూ బిక్కమొహమేసుకుని పనిలో పడింది సునీత.

రెండ్రోజుల తర్వాత..

హాల్లో ఫోను రింగవుతోంది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేరు. చంద్రముఖి వచ్చి ఫోన్ తీసి 'హలో.. హలో' అని వెంటనే పెట్టేసి సునీత వైపు ఓరగా చూస్తూ "ఎవరో రాంగ్ నంబర్" అంటూ వంటింట్లోకి పోయింది.

ఈ లోపల మరలా ఫోను మ్రోగింది. ఈసారి మామా వచ్చి తీసి మాట్లాడింది.

సునీతను పిలిచి "కాల్ నీకే" అంటూ ఫోను చేతికి ఇచ్చింది.

అవతల వాళ్ళు చెప్పిన మాటలు వినగానే కుప్పకూలిపోయింది సునీత. "నాయనా.. ఓ.. నాయనా" అంటూ ఏడ్వసాగింది.

మామాకు విషయం అర్థమయి జాలిపడి అయ్యో ఏడవకు అని ఓదార్చబోతుండగా చంద్రముఖి వచ్చి "మామా దాని నాటకాలు నమ్మకు." అది ఇక్కడ పని మానేసి ఇండియాకు పోవాలని ప్లాన్ వేసింది.

అక్కడినుండి నాయనకు బాగలేదని అబద్ధాల జాబులు వేయించి ఫోన్లు చేయిస్తోంది. అంతే తప్ప అదంతా నిజం కాదు. దాన్ని ఇపుడు ఇండియా పంపకండి" అని చెప్పింది కఠినంగా.

మామాకు ఎవరి మాట నమ్మాలో అర్థం కాలేదు.

ఆ సాయంత్రం సునీతను పిలిచి చెవిలో చిన్నగా ఏదో చెప్పింది ఫాతిమా. భయంతో కళ్ళు విప్పార్చి చూసింది సునీత. 'అమ్మో' అంటూ గుండెల మీద చేతులు వేసుకుంది.

"భయపడకు. నేనున్నా కదా. అంతా నేను చూసుకుంటాను" నవ్వింది ఫాతిమా.

సాహసాలు చెయ్యడమంటే ఫాతిమాకు చాలా ఇష్టం.

అర్థరాత్రి. కువైట్ పట్టణం నిశ్శబ్దాన్ని సంతరించుకుంది. పనివాళ్ళ గదిలో చంద్రముఖి గురక పెడుతూ నిద్రపోతోంది. మెల్లగా పైకి లేచింది సునీత.

నాలుగు జతల బట్టలు సంచిలో కుక్కుకుని శబ్దం కాకుండా తలుపు తీసుకుని బయటికి వచ్చింది.

చెప్పినట్లుగానే అక్కడ ఫాతిమా నిలబడి వుంది.

ఇద్దరూ అడుగులో అడుగు వేస్తూ నడిచి అటుపక్కగా వున్న చిన్న గేటును తీసి బయటికి వచ్చారు.

ఇంటి బయట గోడ పక్కన కారు సిద్దంగా వుంది. కూర్చోగానే కారును స్టార్ట్ చేసి ఎయిర్ పోర్ట్ వైపు ఉరికించింది ఫాతిమా.

అంతవరకూ అదిరే గుండెలతో వణికిపోతూ వుంది సునీత. పట్టుకుంటే బాబా చంపేస్తాడు. మామా కొడుతుంది. చంద్రముఖి సంగతి చెప్పనవసరం లేదు. కొందరు పనివాళ్ళు పనితో ఆకట్టుకుని, అక్కడే పాతుకుపోయి అతి తెలివితో అజమాయిషీ చేస్తుంటారు. సాటి పనివారిపై జులుం చెలాయిస్తుంటారు.

వీళ్ళు చాలా ప్రమాదకరం. వీళ్ళ బారినుండి కొత్తవాళ్ళు తప్పించుకోవడం కష్టం. ఆలోచనల నుండి తేరుకుని..

"ఫాతిమా.. నా గురించి బాబా మామా నిన్ను తిడతారేమో కదా" అంది బాధగా.

"అదంతా నేను చూసుకుంటాను. నువ్వు వర్రీ అవకు. బాబాకు నేనంటే చాలా ఇష్టం. నన్ను ఏమీ అనడు" అంటూ ఎక్సలేటర్ నొక్కింది ఫాతిమా.

కారు రయ్ మని పరుగులు తీసి ఎయిర్ పోర్టు ముంగిట ఆవరణంలో ఆగింది. పాస్పోర్టు, టికట్, కొన్ని దినార్లు చేతిలో పెట్టి "తొందరగా లోపలికి వెళ్ళు. చెన్నై కి వెళ్ళే ఇండియన్ ఎయిర్ లైన్స్ రెడీగా వుంది. నెల తరవాత నువ్వు మరలా ఇక్కడికి వచ్చే ఏర్పాట్లు చేస్తాను" అంటూ కౌగిలించుకుని ముద్దు పెట్టుకుంది.

సునీతకు ఏం చెప్పాలో తోచక మూగబోయిన గొంతుతో మాటలు రాక చేతులు జోడించింది.

ఫాతిమా కూడా భారతీయ సాంప్రదాయ పద్ధతిలో వంగి నమస్కరించి వీడ్కోలు పలికింది.

ఫాతిమా లాంటి మంచి వాళ్ళు వుండటం మూలాన భూమి ఇంకా గతి తప్పక తిరుగుతూ వుంది అనుకుంటూ కనుమరుగయే కారును చూస్తూ, ఫాతిమాకు మనసులో కృతజ్ఞతలు చెప్పుకుంటూ కువైట్ ఎయిర్ పోర్టు లోపలికి అడుగు పెట్టింది సునీత.

అంతటితో అయిపోలేదు కథ.ఫాతిమా ఇంటికి వెళ్ళేసరికి చంద్రముఖి అప్పుడే నిద్రలేచి "సునీత పారిపోయింది.. సునీత పారిపోయింది..వెతకండి" అని కేకలు వేస్తోంది.

"ఏయ్ అరవకు. సునీత పారిపోలేదు. నేనే విమానం ఎక్కించి వచ్చాను" ధీమాగా చెప్పింది ఫాతిమా.

ఆశ్చర్యంగా చూసింది చంద్రముఖి.

"అవును. అరవకుండా, ఎక్కువ చెయ్యకుండా వెళ్ళి నీ పని నువు చూసుకో. లేదంటే నిన్ను శాశ్వతంగా శ్రీలంక పంపించేస్తా. మర్యాదగా వుంటే మా అమ్మ నాన్నతో మాట్లాడి నీపై పనిభారం పడకుండా ఒక నెలరోజుల పాటూ ఇంకో పనిమనిషిని చూస్తాను" అంది.

ఎక్కువ మాట్లాడితే ఫాతిమా కొడుతుంది అనే భయంతో ఇక కిక్కురుమనకుండా వంటింట్లోకి వెళ్ళిపోయింది చంద్రముఖి.

బాబాకు పెద్ద బిడ్డ ఫాతిమా అంటే చాలా ఇష్టం. ఫాతిమా తండ్రికి సర్ది చెప్పింది. ఫ్రెండ్ ఇంట్లో వున్న మనిషిని ఒక నెల రోజుల పాటూ పనికి తీసుకొచ్చింది. దీంతో మామా కూడా ఏమీ అనలేదు. ఆరిందాలా పెద్దరికంతో బాధ్యతగా ప్రవర్తిస్తున్న ఫాతిమా పద్దతి వారికి ముచ్చట గొలిపింది. ఎంతైనా కన్న కూతురు. చేసింది మంచిపనే కాబట్టి ఫాతిమా మానసిక పరిణతికి, మంచి హృదయానికి మనసులో సంతోషించారు.

సునీత వెళ్ళిన నాల్రోజులకే వాళ్ళ నాన్న చనిపోయాడట. సునీత ఫోన్ చేసి చెప్పింది. ఫాతిమా పంపించడం వల్లనే తండ్రిని కడసారి కళ్ళతో చూసుకున్నానని చెప్పడంతో బాబా మామా కూడా "పోన్లే ఆ పాపం మనకెందుకు మంచి పని చేసావు అల్లా నిన్ను చల్లగా చూస్తాడు" అని ఫాతిమాను మెచ్చుకున్నారు.

చెప్పిన మాట ప్రకారం నెలరోజుల తర్వాత సునీత తిరిగి వచ్చింది. ఫాతిమాతో పాటూ బాబా మామా కూడా సంతోషించారు. చంద్రముఖి నోరు అదుపులో పెట్టుకోకపోతే ఇంటికి పంపేస్తామని బెదిరించడంతో ఆమె దురుసుతనం తగ్గింది. సునీతకు జీతం పెంచడంతో పాటూ ఇంట్లో మనిషిలా చూసుకున్నారు.

తర్వాత ఫాతిమా పెళ్ళి అయ్యాక తన పనులు చూడటానికి పుట్టింటి నుండి సునీతను కూడా తనతో పాటూ తీసుకెళ్ళింది.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments